# కడ్డీ తంత్రి వాద్యం

ఈ వాద్యం వీణవలె ఉంటుంది. కడ్డీపై నిలబెట్టి వాయించుటవల్ల కడ్డీ తంత్రి వాద్యమంటారు. ఈ వాద్య కళాకారులు మాలదాసరులు. వీరిని మిత్తుల అయ్యవార్లని కూడా అందురు. వీరు విశిష్టాద్వైతులు అనగా శ్రీరామానుజ మతస్థులు, చక్రాంకితపరులు. ఈ వాద్య కళాకారులు ఆదిలాబాదు జిల్లాలోను, కరీంనగర్ జిల్లాలోను రెండు కుటుంబాలు. నిజామాబాదులో ఒక కుటుంబం. ఆదిలాబాదులో ఒక కుటుంబం. లోగడ ఈ వృత్తిపై చాలా కుటుంబాలు జీవించేవారు. కానీ టి.వి. సినిమాల ప్రభావం వల్ల




ఈ వృత్తిపై ఆధారపడువారు తగ్గిపోయనారు. ఈ వాద్యానికి ఇద్దరు కళాకారులు ఉందురు. ఒకాయన కడ్డీ తంత్రీవాయిస్తుంటే ఇంకొకాయన తాళం వేస్తుంటాడు. ఈ వాద్యానికి నాలుగు తీగలుగలవు. కుడిచేతిలో ఉన్న వెదురుపుల్లకు గజ్జెలు అందె కట్టియుండును. ఎడమచేతిలో సన్నవెదురుపుల్ల ఉండును. ఈ రెండుపుల్లలతో వాయిస్తారు. ఈ వాద్యంతో ఈ క్రింద కథలు చెపుతుంటారు. కథ అంతాపాట, ద్విపదసీసం, గీతం వృత్తాలలో వినిపిస్తారు. (1) రామాయణం (2) తిరునామలి (3) ఆధ్యాత్మలు (4) దేహతత్వాలు (5) భాగవతం (6) యక్షగానం శ్రావణమాసంలో మొత్తం ఒకో గ్రామంలో ఉండి అక్కడగుడిలో కథ చెబుతుంటారు. మిగతా రోజులలో వృద్ధులు పరమపదించినపుడు రాత్రిపూట చనిపోతే కథకు పిలుస్తారు. ఈ వాద్య కళాకారులలో అదిలబాద్ జిల్లా వడ్డాది గ్రామానికి చెందిన శ్రీ తుమ్మపూడి రామస్వామి ప్రసిద్దులు.